చందానగర్ సర్కిల్ 21 ఏఎంసీగా మహేందర్‌రెడ్డి



చందానగర్ : చందానగర్ సర్కిల్ -21 అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా ఆర్‌కె.మహేందర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. చాంద్రాయణగుట్ట సర్కిల్ ఏఎంసీగా విధులు నిర్వహించి బదిలీపై చందానగర్ సర్కిల్‌కు వచ్చారు. గతంలో కూకట్‌పల్లి సర్కిల్ ఏఎంసీగా కూడా పని చేశారు.

యోగా రాష్ట్రస్థాయి పోటీల్లో విజేత వైష్ణవి



విద్యార్థిని వైష్ణవి

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ 7వ తరగతి విద్యార్థినికి యోగా పోటీలలో ప్రథమ స్థానం లభించింది. సీఎం కప్ అండర్-14 రిథమిక్ యోగా విభాగంలో వైష్ణవి సత్తా చాటింది. రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నారు. మొదటిస్థానంలో నిలవడంపై క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపల్ మురళి గురువారం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైష్ణవికి శిక్షణ ఇచ్చిన స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ యోగా ఇన్‌స్ట్రక్టర్ మట్టపల్లి సతీష్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: శ్రీ హరిహర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తూండ్ల కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను గురువారం కూకట్‌పల్లి సేవా సమితి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. సమాజంలోని నిరుపేదలకు తమ వంతు సేవ చేయాలనే లక్ష్యంతో 25 సంవత్సరాల క్రితం సేవా సమితిని స్థాపించామన్నారు. ఎందరో నిరుపేదలకు తమ వంతు సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు మద్రు నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి దొంతినేని వెంగళ్‌రావు, ఆర్థిక కార్యదర్శి తూండ్ల వెంకటరమణ శర్మ, కార్యదర్శి దండె ప్రభు, తూండ్ల వశిష్ట, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారమందించండి



వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని గురువారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిశారు. గచ్చిబౌలి డివిజన్‌లో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, కాలనీలు, బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ వివరించారు. ప్రతిపాదనల స్థాయిలో ఉన్న అభివృద్ధి పనుల మంజూరుపై చర్చించారు. డివిజన్‌లోని సమస్యలను దశలవారిగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌సీ శంకర్‌నాయక్, గచ్చిబౌలి డివిజన్ నాయకులు తిరుపతి, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేఇన్‌స్టాకార్డ్ కార్యాలయం ప్రారంభం



గచ్చిబౌలి: ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేఇన్‌స్టా కార్డ్ కార్యాలయాన్ని గచ్చిబౌలిలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్ట్‌నర్, పేఇన్‌స్టా కార్డ్ బోర్డు మెంబర్, ఇన్వెస్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు, సీఈఓ సాయికృష్ణ మాట్లాడుతూ పేఇన్‌స్టాకార్డ్ యొక్క వేగవంతమైన వృద్ధి, విజయాల గురించి గర్వపడుతున్నామన్నారు. సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నగేష్ కోటిపల్లి మాట్లాడుతూ ఆధునాతన సాంకేతికత, భద్రతా వ్యవస్థ, సురక్షితమైన చెల్లింపు అనుభవముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపటి తరం కోసం.. ‘ఎస్కీ ఎస్‌పీజీఎస్’

- విద్య, శిక్షణలో అగ్రగామిగా..
- 100 శాతం ప్లేస్‌మెంట్స్.. భవిష్యత్ నాయకుల రూపకల్పనే లక్ష్యం
- 16 వసంతాలు.. నేడు మూడో స్నాతకోత్సవం
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాక

రాయదుర్గం: విద్య, శిక్షణలో అగ్రగామిగా నిలుస్తోంది ‘ఎస్కీ’లోని స్కూల్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ స్టడీస్ (ఎస్‌పీజీఎస్). నేడు గ్లోబల్ ట్రెండ్లు, పరిశ్రమల అవసరాలు, సాంకేతిక ఆవిష్కరణలకు అనుగుణంగా లాభాపేక్షలేని విద్యాసంస్థగా దీన్ని ఏర్పాటు చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ద్వారా 2008లో ఏఐసీటీఈ ఆమోదంతో ఈ ఎస్‌పీజీఎస్‌ను ఏర్పాటు చేశారు. వృత్తిపరంగా మరింత నైపుణ్యంతో పనిచేసేందుకు దోహదం చేసేలా ఎస్‌పీజీఎస్‌ను తీర్చిదిద్దారు. రేపటితరం నాయకులను రూపొందించడానికి ‘ఎస్కీ’ తగిన ప్రణాళికను రచిస్తోంది.

నేడు మూడో స్నాతకోత్సవం..

‘ఎస్కీ’లో 16 ఏళ్ల క్రితమే ఎస్‌పీజీఎస్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు రెండు స్నాతకోత్సవాలను నిర్వహించగా తాజాగా శుక్రవారం మూడో స్నాతకోత్సవానికి ఏర్పాట్లు చేశారు. 2012లో, 2015లో స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈసారి క్యాంపస్‌లో నిర్మించిన భారీ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎస్‌పీజీఎస్‌లోని కోర్సులు ఇవే..

ఎస్‌పీజీఎస్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల పూర్తి సమయం



ఎస్కీ ఎస్‌పీజీఎస్ విద్యార్థుల బృందం

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) కోర్సులను అందించేంది. నాణ్యమైన, విలువ అధారిత విద్యకు కట్టుబడి కోర్సులను రూపొందించారు. ఎయిర్ కండిషన్డ్ మల్టీమీడియా తరగతి గదులు, పరిశ్రమ ఆధారిత పాఠ్యాంశాలు, ప్రముఖ బ్యాంకుల నుంచి విద్యారుణాలు, 100 శాతం ప్లేస్‌మెంట్‌లు, శిక్షణ, వృత్తిపరమైన నెట్‌వర్క్‌లలో నైపుణ్యం పెంపుదల, ప్రతిభావంతులైన విద్యార్థులకు 100 శాతం వరకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నారు.

- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ మేనేజ్‌మెంట్
- పీజీడీఎం ఇన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్
- పీజీడీఎం ఇన్ ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్



గచ్చిబౌలిలోని ఎస్కీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్‌పీజీఎస్ ప్రధాన భవనం

- పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్నోవేషన్ కోర్సు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, వెంచర్ డెవలప్‌మెంట్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ)
- త్వరలో బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ) కోర్సును ప్రవేశపెట్టనున్నారు.



ఎస్కీ ప్రధాన ద్వారం



ఎస్‌పీజీఎస్‌లో అధునిక వసతులతో తరగతి గది

“ లాభాపేక్ష లేకుండా



ఎస్‌పీజీఎస్ విద్యాసంస్థ లాభాపేక్ష లేని సంస్థ. ఇందులో పీజీడీఎం, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఉన్నాయి. గచ్చిబౌలిలో 70 ఎకరాలలో ఆహ్లాదపూరిత వాతావరణంలో కొనసాగుతున్న క్యాంపస్‌లో అత్యాధునిక తరగతి గదులు, పలు రకాల సౌకర్యాలను కల్పిస్తున్నాం.

–జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్, ‘ఎస్‌పీజీఎస్, ఎస్కీ

“ యూనివర్సిటీ హోదా లక్ష్యంగా..



పీజీడీఎం, యూజీ కోర్సులతోపాటు ఈ ఏడాది నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. ఎస్‌పీజీఎస్‌కు యూనివర్సిటీ హోదా పొందేలా చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నాం, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. భవిష్యత్తులో అత్యున్నత ప్రమాణాలతో, నాణ్యమైన విద్య అందించాలన్నదే మా కోరిక.

–డాక్టర్ జి రామేశ్వరరావు, డైరెక్టర్, ఎస్కీ

4,5 తేదీల్లో మల్లన్న జాతర

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో జనవరి 4, 5 తేదీలలో బండల మల్లన్నస్వామి జాతర జరగనున్న దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తెలిపారు. గురువారం ఆలయాన్ని సందర్శించారు. జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

28 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 28 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి వెయ్యి రూపాయల జరిమాన, ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 1500, అదేవిధంగా మరో 19 మందికి రూ .2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సౌరశక్తిని వినియోగించుకోవాలి

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని హిమసాయి లేక్‌వ్యూ అపార్టుమెంట్‌లో సోలార్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే గాంధీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సౌరశక్తిని వినియోగించుకొని భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షులు సత్యనారాయణరావు, హిమసాయి లేక్ వ్యూ అసోసియేషన్ అధ్యక్షులు హరీష్ దామరాజు, ఉపాధ్యక్షులు అరవింద్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్, ట్రెజరర్ రాజన్‌బాబు, ప్రతినిధులు పరిమళ్ సాహు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.





మాదాపూర్: శ్రీకాళహస్తికి చెందిన కళాకారులు వేప చెక్కతో తయారు చేసిన దేవతా విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. గృహాలంకరణ ఉత్పత్తులు, శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలు, దశావతారాల విగ్రహాలను అందుబాటులో ఉంచారు. వుడ్‌కార్వింగ్ ఉత్పత్తులు రూ. 7వేల నుంచి 6.5 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయని శిల్పి గురవాచారి తెలిపారు. ఆర్డర్‌పై అవసరమైన వాటిని తయారు చేసి ఇస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్ 7013117456లలో సంప్రదించవచ్చు.



ముగ్గుల పోటీలు.. విజేతలకు బహుమతుల పంపిణీ

చందానగర్ : మన సంస్కృతి, సాంప్రదాయాలకు పండుగలే ప్రతీకలని కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెటి సాయిబాబా పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చందానగర్ వెంకటాద్రి కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథులుగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్, కొమిరిశెట్టి సాయిబాబాలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తాటిచర్ల వరలక్ష్మి, అనూషా, కుమారి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు ఉమా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా, రామస్వామి యాదవ్

6న తుది ఓటర్ జాబితా

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 6న తుది ఓటరు జాబితా వెలువడనున్నట్లు ఓటర్ నమోదు అధికారి దేవుజా పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఎస్ ఆర్ -2025) కు సంబంధించి గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో దేవుజా మాట్లాడుతూ బూత్ లెవల్ సహాయకులను నియమించవలసిందిగా పార్టీల ప్రతినిధులను కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 422 పోలింగ్‌బూత్‌లకు గాను 4,19,496 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇంకా ఎవరైనా నమోదు చేసుకోదలిస్తే చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల మరియు ఉపాధ్యాయులు పటాన్‌చెరు మండలంలో 86 మంది టీచర్లు 1363 మంది పట్టభద్రులు ఇది వరకే నమోదు చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, ఎలక్షన్ డిటి సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొల్కురి నరసింహారెడ్డి, బీజేపీ నాయకులు శివకుమార్, సీపీఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

5న భగవద్గీత శిక్షణా తరగతులు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకర మఠంలో ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు భగవద్గీత అభ్యాస తరగతులు నిర్వహించనున్నట్లు మఠం మోతీనగర్ శాఖ పరిపాలనాధికారి సీఎస్‌ఆర్.మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భగవద్గీత అభ్యాస కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెలల తరబడి మురుగు సమస్య



న్యూ కాలనీ రోడ్డు నంబర్-6లో పారుతున్న మురుగు

మియాపూర్: కాలనీలో రోడ్లపై మురుగు ప్రవాహంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్ న్యూ కాలనీ రోడ్డు నంబర్-6లో మురుగు పారుతోంది. నెలల తరబడి మురుగు సమస్య ఉన్నా పట్టించుకునే వారు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందే మురుగు ప్రవహిస్తుందని , రెండు నెలలుగా మురుగులో రాకపోకలు సాగిస్తున్నామని వాపోయారు. దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసిన ప్రతిసారి నామ మాత్రంగా పరిష్కరించి వెళ్తున్నారని తిరిగి సమస్య పునరావృతం అవుతుందని వాపోయారు. అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గవర్నర్‌ను కలిసిన హిమాచల్‌ప్రదేశ్ బృందం

రాయదుర్గం: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను హిమాచల్‌ప్రదేశ్ యువ సంఘం గురువారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ యువ సంఘం బృందంతో సమావేశమై ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతను వివరించారు. సంస్కృతులను కలపడం ద్వారా కాకుండా వాటి విశిష్టతను చాటిచెప్పడం ద్వారా భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ‘మనూ’ నోడల్ అధికారి ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, ఏఐసీటీఈ సలహాదారు ప్రొఫెసర్ రాములు మోరే, హిమాచల్ ప్రదేశ్ నోడల్ అధికారి పరమ్‌సింగ్, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ మెరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో హిమాచల్‌ప్రదేశ్ యువ సంఘం బృందం

టీహబ్, గోల్కొండ, సెవెన్ టూంబ్స్ సందర్శన

హిమాచల్‌ప్రదేశ్ యువ సంఘం బృందం నోడల్ అధికారులు, కోఆర్డినేటర్లతో కలిసి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ను సందర్శించారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, టీహబ్ నిర్మాణం, లక్ష్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెవెన్‌టూంబ్స్, గోల్కొండ కోటను సందర్శించారు.

శిల్పారామం..

- ఎకరా స్థలంలో దాదాపు 80కి పైగా కళాకృతులు
- ప్రత్యేక ఆకర్షణగా బయోడైవర్సిటీ వాల్
- ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో..




స్కల్ప్చర్ పార్కులో ఆకట్టుకుంటున్న కళాకృతులు



మాదాపూర్: పనికిరాని వ్యర్థాలతో అర్థమయ్యేలా.. ఆలోచింపజేసేలా కళాకారులు పలు ఆకృతులను తయారు చేశారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఎకరం స్థలంలో ఏర్పాటు చేసిన స్కల్ప్చర్ పార్కు సందర్శకులను కట్టిపడేస్తుంది. కళాకారులు ఇనుము, వివిధ రకాల మెటల్‌లతో పలు కళాకృతులను తయారు చేశారు. పందెం కోళ్లు, డైనోసార్, నెమలి, సైనికులు, వివిధ రకాల జంతువుల ఆకృతులు ఆకట్టుకుంటున్నాయి. ప్రధాన ద్వారం వద్ద ఉన్న బయోడైవర్సిటీవాల్‌పై ఇనుముతో జంతువుల బొమ్మలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి విశాల్ మాట్లాడుతూ పార్కులో కళాకృతులు బాగున్నాయన్నారు. కళాకారులు పనికిరాని వస్తువులతో అద్భుతంగా కళాఖండాలను తయారు చేశారన్నారు.



ఫోటో తీసుకుంటున్న సందర్శకులు



ప్రధాన ద్వారం వద్ద బయోడైవర్సిటీ వాల్

